హైకోర్టు తీర్పుపై గ్రూప్స్ అభ్యర్థులు హర్షం

చిక్కడపల్లి: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షపై హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల అభ్యర్థులు హర్షం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం అశోక్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. న్యాయస్థానం తీర్పు టీజీపీఎస్సీకి చెంపపెట్టు లాంటిదని అన్నారు. టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌కు వెళ్లాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. గ్రూప్–1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసే జీఓ నం.29ను వెంటనే రద్దు చేయాలన్నారు. దీనిని అడ్డుగా పెట్టుకొని గ్రూప్–2, 3లకు ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఆపొద్దన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు నరసింహ, నాగరాజు, ఇంద్రనాయక్, రవికుమార్, జనార్దన్, విక్రమ్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గౌడుల సమస్యలపై పోరాటం చేస్తా

పల్సం సోమన్నగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సర్దార్ సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పల్సం సోమన్నగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కె వీరస్వామిగౌడ్ నియమక పత్రాన్ని అందజేశారు. సోమన్న గౌడ్ మాట్లాడుతూ... గౌడుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని చెప్పారు.

ఆశలకు జీవం పోయండి

డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆత్మహత్యలకు కాదు ఆశలకు జీవం పోయాలని ప్రోగ్రెసివ్ సైకాలాజిస్ట్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్ ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆహ్వాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు చదువులో ఒత్తిడి ఫలితాల భయంతో ఆత్మహత్యల వైపు ఆలోచిస్తున్నారని అన్నారు. ఇతరులతో పోల్చుకుని మిమ్మల్ని మీరు తక్కువగా అంచనా వేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో లియో చైర్‌పర్సన్ జి.కృష్ణవేణి, లయన్స్ క్లబ్ కార్యదర్శి జి.లక్ష్మి, సాగర్‌రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.1,17,188

చిక్కడపల్లి: వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయం హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయం చైర్మన్ జానకీసుధాకర్, ఈవో దేవనాథం మాట్లాడుతూ... రూ.1,17,188 ఆదాయం వచ్చిందన్నారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు పద్మావతి, గణేశ్, శ్యామ్‌కుమార్ ముదిరాజ్, నిర్మల, ఎం.రామకృష్ణ, గాంధీ హరీష్, సీతారాణి తదితరులు పాల్గొన్నారు.

యోగాలో 'అంబేడ్కర్ కళాశాల'కు తృతీయ స్థానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ యోగా చాంపియన్‌షిప్ పోటీలో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కళాశాలకు తృతీయ స్థానం లభించింది. బుధవారం కేడియా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీలో 10 జట్లు పాల్గొనగా అంబేడ్కర్ కళాశాలకు తృతీయ స్థానం లభించింది. ఓయూ ప్రొఫెసర్ రాజేష్, సునీల్‌కుమార్ ఈ సందర్భంగా క్రీడాకారులకు సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజవివేక్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ లింబాద్రి జాయింట్ డైరెక్టర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మట్టా శేఖర్, ఫిజికల్ డైరెక్టర్ శ్రావణ్, పండు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయాలి

కాచిగూడ: వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బీజేపీ సికింద్రాబాద్ నియోజకవర్గం మహిళా నేత మేకల కీర్తి హర్షకిరణ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు బుధవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో డాక్టర్ ఎన్.గౌతంరావును ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మేకల సారంగపాణి, కనకట్ల హరి, ప్రభుగుప్తా, కన్నాభిరామ్, ప్రకాష్‌గౌడ్, శ్రీధర్ రావు, హనుమంతు ముదిరాజ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికతను పెంపొందించాలి

ముషీరాబాద్: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత భావనను పెంపొంచాలని భవానీశంకర దేవాలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్ అన్నారు. ఆలయ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ టెండర్‌ను స్థానికుడు ఎస్ఎన్ శివశంకర్ బుధవారం రూ.3.85లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, ఆలయ ధర్మకర్తలు రాజు, సాయిబాబా, ఆలయ సిబ్బంది సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిమ్మ చీకట్లు..!

అంబర్‌పేట నియోజకవర్గంలో మెజార్టీ ప్రాంతాల్లో వెలుగని వీధి దీపాలు

- వెలుగని వీధి దీపాలతో అవస్థలు పడుతున్న ప్రజలు
- ఫిర్యాదు చేస్తే గతంలోనే పరిష్కరించామంటున్న సిబ్బంది
- కొన్ని ప్రాంతాల్లో పగలే వెలుగుతున్న వీధి దీపాలు

అంబర్‌పేట: వెలుగని వీధి దీపాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చికటిపడితే వీధుల్లో రాకపోకలు సాగించడానికి జంకుతున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని బాగ్‌అంబర్‌పేట, గోల్నాక, అంబర్‌పేట, నల్లకుంట, కాచిగూడ డివిజన్లలోని మెజార్టీ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగడం లేదు. పట్టించుకోవాల్సిన జీహెచ్ఎంసీ వీధి దీపాల విభాగం అధికారులు, నిర్వహణ కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రోడ్లతో పాటు చిన్న చిన్న గల్లీల్లో సైతం వీధి దీపాలు వెలుగకు స్థానికులు భయాందోళనకు గురువుతున్నారు. ఇప్పటికైన వీధి దీపాల సమస్యను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



అంబర్‌పేటలో వెలుగని వీధిలైటు

ఫిర్యాదు చేస్తే తప్పించుకుంటున్నారు...

వీధి దీపాలు వెలుగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తే పరిష్కరించాల్సిన అధికారులు, నిర్వహణ కాంట్రాక్టర్లు తప్పించుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. వీధి దీపాలు వెలగడం లేదని సమీప ఇంటి నంబరుతో ఫిర్యాదు చేస్తే గతంలో ఈ ప్రాంతం నుంచి ఫిర్యాదు వచ్చిందని, పరిష్కరించామని బుకాయిస్తున్నారు. దీంతో నెలల తరబడి వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి లైట్లకు మరమ్మతు చేయాలని ఒత్తిడి చేస్తే తూతూమంత్రంగా ఒకటి, రెండు లైట్లను మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

ఓ వైపు పగలే వెలుగుతున్న వీధి దీపాలు...

మెజార్టీ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు అవస్థలు పడుతుంటే మరో వైపు పగటి పూట వీధి వెలుగుతుండడంతో స్థానికులు అధికారుల తీరుపై విమర్శిస్తున్నారు. డీడీ కాలనీలో గత కొద్ది రోజులుగా ఉదయం సమయంలో వీధి దీపాలను బంద్ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీధి లైట్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



బాగ్‌అంబర్‌పేటలో వెలుగని వీధి దీపాలు



డీడీకాలనీలో పగలే వెలుగుతున్న వీధిలైటు

పెరిగిపోతున్న నేరాలు- అసాంఘిక కార్యకలాపాలు

వీధి దీపాలు వెలుగకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో అసాంఘిక కార్యాకలపాలు పెరిగిపోతున్నాయి. వీధి సందుల్లో యువత గంజాయి సేవిస్తూ స్థానికంగా తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నారు. గల్లీల్లో ఘర్షణలు, మహిళలను వేధించడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఎక్కడ వీధి లైటు వెలగడం లేదా అని జులాయిలు చూస్తూ అక్కడే అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతున్నారు. అలాగే వారం రోజుల క్రితం గోల్నాక తిరుమల నగరంలో వరుసగా సెల్‌ఫోన్ చోరీల సంఘటన చోటు చేసుకున్నాయి. వీధి లైట్ల సమస్య రాకపోకలకే కాకుండా అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోవడానికి దోహదపడుతుంది. దీంతో సమన్వయంలో సమస్య పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పర్యవేక్షిస్తా...

వెలుగని వీధి దీపాల సమస్యపై సంబంధిత సిబ్బంది పని తీరుపై సమీక్షిస్తాను. సమస్యను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశిస్తాను. నిర్వహణ లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటాను.

– డీఎంసీ మారుతీదివాకర్

'అంబానీ మెప్పు కోసం మోదీ పరితపిస్తున్నారు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో ప్రధాని మోదీ విధానాలతో విదేశాంగ విధానం ప్రమాదంలో పడిందని ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ విమర్శించారు. బుధవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ అధ్యక్షతన మాజీ ఎంపీ, ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్షులు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'అమెరికా ఆధిపత్యం.. భారతదేశం ఏమి చేయాలి?'అనే అంశంపై స్మారకోపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ప్రొ. నాగేశ్వర్ మాట్లాడుతూ... అంబానీ మెప్పు కోసం మోదీ పరితపిస్తున్నారని విమర్శించారు. ట్రంప్ విధానాలను కూడా ప్రశ్నించలేని స్థితిలో పారిస్ పాలసీ ఉందన్నారు. ఏచూరి స్ఫూర్తితో యూనివర్సిటీలో సెక్యూలర్ భావాల పెంపు కోసం ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో విద్యా ఉపాధి అవకాశాల కోసం ఏచూరిని ఆదర్శంగా తీసుకొని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టచార్య, టి. సాగర్, మమత, కె.శంకర్, టి.నాగరాజు, అశోక్‌రెడ్డి, ప్రశాంత్,లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి స్మారకోపన్యాసంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు వేతనాలు పెంచాలి



ఏఎస్‌పీడీ రాధారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ముషీరాబాద్: కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లకు వేతనాలు పెంచడంతో పాటు పనిభారాన్ని తగ్గించాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్(టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏఎస్‌పీడీ రాధారెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. పని భారం విపరీతంగా పెరిగిందన్నారు. రిటైర్ అయిన కార్మికులకు గ్రాట్యూటీ చెల్లింపులు లేవన్నారు. ఒక వైపు ధరలు పెరుగుతుంటే వేతనాలు పెరగక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా వేతనాలను రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. నైట్ డ్యూటీలను రద్దు చేసి హెల్త్ ఇన్సురెన్స్‌ని అమలు చేయాలన్నారు. రిటైరైన ఉద్యోగులకు గ్రాట్యుటీని చెల్లించాలన్నారు. అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే ఎస్పీడీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, శశికళ, అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శులు వీరమణి, లక్ష్మి, సునీల్, అశోక్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా సేవా కార్యక్రమాలను నిర్వహించాలి

కాచిగూడ: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన 'సేవా పక్షం'కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సెప్టెంబర్ 17వ తేదీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు వివిధ సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే స్వచ్ఛ భారత్, రక్తదాన శిబిరాలతో పాటు ఇతర అనేక సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి అధ్యక్షత వహించారు. పార్టీ నేతలు బంగారు శృతి, కళ్యాణ్ నాయక్, బద్దం మహిపాల్‌రెడ్డి, రాథోడ్ కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు



సుందరయ్య పార్కు వద్ద నిరసన ర్యాలీ చేపట్టిన ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడొద్దని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్ అన్నారు. సుందరయ్య పార్కు వద్ద ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా కోటా రమేష్ మాట్లాడుతూ.. గ్రూప్–1 పరిక్షలో టీజీపీఎస్ఈ చేసిన తప్పిదాల వల్ల రెండుసార్లు ప్రిలిమ్స్ రద్దు అయ్యిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష హాల్ టిక్కెట్ దగ్గర నుంచి వివాదాలకు కేంద్ర బిందువు అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.రజనికాంత్, పి.నాగరాజు, వెంకటేష్, కిరణ్, అశోక్‌రెడ్డి, జావిద్, మమత, శంకర్, లెనిన్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యం దోపిడీని చట్టాలతోనే అరికట్టాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రస్తుతం సమాజంలో ప్రజలకు అందుబాటులో లేని విద్యా, వైద్య దోపిడీని ప్రభుత్వాలు చట్టాలు ద్వారానే నియంత్రించాలని ప్రొ. నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మద్దికాయల ఓంకార్ శత జయంతిని పురస్కరించుకొని ఏఐఎఫ్‌డీవై, ఎఐఎఫ్‌డీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... విద్యా, వైద్యంపై విద్యార్థులు రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాదగోని రవి, వనం సుధాకర్, కర్ర రాజీరెడ్డి, పల్లె మురళీ, గడ్డం నాగార్జున, వెంకటేష్, మట్టయ్య పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న ప్రొ. నాగేశ్వర్‌రావు

బాలిక అదృశ్యం

కాచిగూడ: హాస్టల్ నుంచి వెళ్లిన బాలిక అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఎస్.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... ములుగు జిల్లాకు చెందిన బాలిక బర్కత్‌పురలోని అన్నపూర్ణ హాస్టల్‌లో ఉంటూ సీఏ చదువుతోంది. మంగళవారం ఉదయం హాస్టల్ నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో, బంధుమిత్రుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి రామకృష్ణ బుధవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: రైల్లో ల్యాప్‌టాప్ చోరీ జరిగిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... వనస్థలిపురానికి చెందిన షేక్ రైసా (41) విశాఖపట్నం వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. విశాఖపట్నం వెళ్లే రైల్లే లగేజితో పాటు ల్యాప్‌టాప్ పెట్టాడు. 10 నిమిషాల తర్వాత చూసే సరికి ల్యాప్‌టాప్ బ్యాగ్ కనిపించకుండా పోయింది. బ్యాగ్‌లో ల్యాప్‌టాప్‌తో పాటు బట్టలు ఉన్నాయి. బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మానవీయ విలువల మహాకావ్యం 'హశిత భాష్పాలు'



హశిత భాష్పాలు పుస్తక సమీక్ష సమావేశంలో పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక గురువు భగవాన్ శ్రీరామ్ రాసిన 'హశిత భాష్పాలు'కావ్యం మానవీయ విలువలను బోధించిన మహా కావ్యమని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన హశిత భాష్పాలు పుస్తక సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ.. శోకం నుంచి శ్లోకం పుట్టినట్టుగా, లోకంలోని కన్నీరు, చిరునవ్వుల వెనుక విశ్వకర్త ప్రణాళిక ఒక్కటుందన్న సత్యాన్ని అద్భుతంగా తన కావ్యంలో రాశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వర్ల, డాక్టర్ పి. విజయలక్ష్మి పండిట్, నాశేశ్వరం శంకర్, ప్రొ. మునిరత్నం నాయుడు, భారతి, ఆనంద్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల మధ్య గొడవలు పెట్టే కుట్రను మానుకోవాలి

చిక్కడపల్లి: ఎస్టీల మధ్య గొడవలు పెట్టి కుట్రను ప్రభుత్వం మానుకోవాలని గిరిజన లంబాడీ విద్యార్థి నేతలు శంకర్‌నాయక్, శ్రీనివాస్ నాయక్‌లు అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాపూరావులు సుప్రీంకోర్టులో ఎస్టీ జాబితాలో నుంచి లంబాడీలను తొలగించాలని పిటిషన్ వేశారని, దీని వెనుక సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని అన్నారు. ఈ పిటిషన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మన్నం ప్రసాద్‌కు నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కుల నిర్మూలన పోరాట సమితి తెలంగాణ ఆధ్వర్యంలో రాజ్య హింసకు బలైన మన్నం ప్రసాద్ సంస్మరణ సభను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హైకోర్టు న్యాయవాది కార్తీక్ నవయాన్ మాట్లాడుతూ.. కుల నిర్మూలన పోరాటంలో అసువుల బాసిన ప్రసాద్‌ను గుర్తు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఆయన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జ్ నిమ్మ నారాయణ, కేఎన్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి బురం అభినవ్, అధ్యక్షులు జయరాజు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



మన్నం ప్రసాద్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న న్యాయవాది కార్తీక్ నవయాన్

గ్రూప్–1 సర్వీస్ ఉద్యోగులపై హైకోర్టు తీర్పును అమలుచేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: గ్రూప్–1 సర్వీస్ ఉద్యోగులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగుల జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన బుధవారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు అనేక అంశాలను లోతుగా పరిశీలించి తప్పులు వెలికి తీశారని, అవకతవకలు జరిగినట్లు నిర్ధారించారని ఆయన తెలిపారు. ముఖ్యంగా కోర్టు తీర్పులోని అంశాలపై లోతుగా పరిశీలించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అవకతవకలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 12,381 మంది ఇంగ్లిష్‌లో హాజరైతే 506 మంది, తెలుగులో 8,694 మంది హాజరైతే 56 మంది, ఉర్దూలో 10 మంది హాజరైతే ఒకరు ఎంపికయ్యారని తెలిపారు. కొన్ని సెంటర్లలో ఒక్కరూ కూడా అర్హత సాధించలేదన్నారు. మెయిన్స్ మూల్యాంకనం ప్రక్రియలో టీజీపీఎస్సీ ప్రతి సూత్రాన్ని ఉల్లంఘించిందన్నారు. మోడరేషన్ విధానాన్ని అనుసరించలేదని పేర్కొన్నారు. పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు.

సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

వాడవాడలా చాకలి ఐలమ్మకు నివాళులు

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం. నర్సింహ ఆధ్వర్యంలో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలకులతో వీరోచితంగా పోరాడి ఆనాడే తెలంగాణ సాధన పాటుపడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఇందిరా శోభన్, మందలపు గాంధీ, జూపల్లి రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, వల్లాల శ్యామ్‌యాదవ్, సాజిద్ అలీ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో...

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయాలను సిద్ధాంతాలు లక్ష్యంగా చేసుకొని పోరాటం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల హక్కులు సాధించుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజ్ కమల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ వినోద్‌యాదవ్ అన్నారు. కవాడిగూడ భాగ్యలక్ష్మి నగర్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సంతోష్ కుమార్, నాయకులు ముత్యాలు, నవీన్‌గౌడ్, జహంగీర్, రమేష్, యాదగిరి, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడ భాగ్యలక్ష్మినగర్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజ్‌కమల్, వినోద్‌యాదవ్

బర్కత్‌పుర చౌరస్తాలో..

కాచిగూడ: అణగారినవర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల కోసం పోరాడిన యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని సీనియర్ కాంగ్రెస్ నేత కె.పి. మురళీ కృష్ణ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం బర్కత్‌పుర చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి నగరంలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం హర్షించదగిన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నేతలు దేవిరెడ్డి విజితారెడ్డి, దూదిగాని లింగం, టి.లాలయ్య గౌడ్, నందు ముదిరాజ్, రాజేష్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో...

చిక్కడపల్లి: సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అలుపెరగని పోరాటం చేశారని నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు చంద్రకళ, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహేందర్, వరప్రసాద్, మహేష్, ముత్యం, అమరావతి, భాగ్య, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బర్కత్‌పురలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు